www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 29 మే 2025

5

ఏలూరు

30న నూజివీడులో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మంత్రి కొలుసు పార్థసారధి సహకారంతో కొత్తపేట ఎస్ఆర్ఆర్‌జెడ్‌పిహెచ్ బాయ్స్ స్కూల్‌లో ఈ నెల 30వ తేదీ శుక్రవారం మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.జితేంద్ర బుధవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని, అలాగే సుమారు 1,095 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారని తెలిపారు. ఈ జాబ్ మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, (డి/బి/ఎం) ఫార్మసీ, పీజీ, బి.టెక్ వంటి విద్యార్హతలు ఉండి 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు గల వారు అర్హులని తెలిపారు. వివరాలకు 8374039719, 9030227668ను (9988853335 - టోల్ ఫ్రీ) సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయడేటా, సర్టిఫికెట్స్ జిరాక్స్‌తో హాజరు కావాలని తెలిపారు.

అమ్మో.. జూన్..!

తల్లిదండ్రుల్లో ఫీజుల టెన్షన్

గతేడాది కంటే 25 నుంచి 50 శాతం వరకూ పెరిగిన బాదుడు

భారీగా బాదేస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలు

ప్రజాశక్తి - కాళ్ల

మరో మూడు రోజుల్లో జూన్ మాసం ప్రారంభం కానుంది. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. మధ్యతరగతి ఉద్యోగుల నుంచి రైతులు, సగటు జీవులు తమ పిల్లలను చదివించుకునేందుకు లెక్కల్లో మునిగి తేలుతున్నారు. రైతుల పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉంది. ఇటు చదువులు, అటు వ్యవసాయ పెట్టుబడులకు ఒకేసారి సొమ్ము సిద్ధం చేసుకోవాల్సి రావడంతో తలలు పట్టుకుంటున్నారు. దీంతో జూన్ మాసం అంటేనే సామాన్య, మధ్యతరగతి ప్రజలు హడలిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

పశ్చిమగోదావరి జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలలు 1375 ఉన్నాయి. ప్రయివేట్ పాఠశాలలు 520 వరకూ ఉన్నాయి. జిల్లాలో లక్షా 41 వేల మంది విద్యార్థులు ఉన్నారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో అత్యధికం ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ ఫీ'జులుం' ప్రదర్శిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తల్లిదండ్రుల్లో పిల్లల చదువు పట్ల గతంకంటే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం పెరిగింది. దీనికి ఆర్థికంగా భారమైనా సిద్ధపడుతుండటం గమనార్హం. అవసరమైతే అప్పులు చేసేందుకూ వెనుకాడటం లేదు. అందుకే జూన్ వస్తోందంటే వారిలో టెన్షన్ మొదలైపోతుంది. సాధారణంగా ఒకటో తేదీ అంటే ప్రతి నెలా ప్రత్యేకమే. జూన్ నెల అంటే ఇంకాస్త ప్రత్యేకమని చెప్పొచ్చు. పిల్లల ఫీజులు, పుస్తకాలు, యూనిఫారం తదితర వాటి కోసం కనీసంగా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ చేతిలో ఉంచుకోవాలి.

పెరిగిన పుస్తకాల ధరలు

గతేడాది రూ.60 ఉన్న నోటు పుస్తకం ధర ఈ ఏడాది రూ.75 పైమాటే. గతేడాది ఆరో తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలకు రూ.వెయ్యి వరకూ ఖర్చయితే ఈ సంవత్సరం కనీసంగా రూ.1500 వరకూ వెచ్చించాల్సిన పరిస్థితి. ఇది ఒక్క నోటు పుస్తకాలకే కాదు. ఇంకా పెన్నులు, పెన్సిళ్లు, ఇతరత్రా వస్తువుల కొనుగోలు వ్యయం అదనం. గతేడాది వరకూ స్కూల్ బ్యాగ్ రూ.300కే దొరికేది. ఈ ఏడాది రూ.500 లేనిదే బ్యాగ్ దొరకని పరిస్థితి ఉంది. ఇక బూట్లు, లంచ్ బాక్స్ తదితరాల గురించి చెప్పనక్కర్లేదు. విద్యార్థుల రవాణాకు సంబంధించిన ఛార్జీలు సైతం యాజమాన్యాలు పెంచడం గమనార్హం. ఈ కాలంలో ప్రత్యేకంగా పెట్రోలు, డీజిల్ ధరలు పెరగకపోయినా నిర్వహణా వ్యయం పెరిగిందని చెప్పడం గమనార్హం. గతేడాది వరకూ ఐదు కిలోమీటర్ల దూరానికి నెలకు రూ.700 తీసుకునేవారు. ఈ ఏడాది రూ.1000 వరకూ డిమాండ్ చేస్తున్నారు. గతేడాది ఓ మోస్తరు ప్రయివేటు పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి ఫీజు రూ.20 వేలకుపైగా ఉండేది. ఈ ఏడాది దానిని రూ.30 వేలకు పైగా పెంచడం గమనార్హం. చిన్నపాటి ప్రయివేటు పాఠశాలల్లో ప్రాథమిక తరగతులకు రూ.15 వేలలోపే ఫీజు ఉండేది. అయితే ఈ సంవత్సరం అది రూ.20 వేలకు చేరింది. ఇప్పటికే కార్పొరేట్ విద్యా సంస్థలు అడ్మిషన్ల కోసం పిఆర్ఒలను రంగంలోకి దించాయి. మరికొన్ని యాజమాన్యాలు నేరుగా విద్యార్థుల తల్లిదండ్రులకే ఫోన్లు చేస్తున్నాయి. ముందస్తుగా ఫీజు చెల్లించి అడ్మిషన్ ఖాయం చేసుకోవాలని ఒత్తిడి చేస్తుండటం విశేషం. ఆలస్యం చేస్తే సీట్లు దొరకవని చెబుతుండటం విశేషం.

ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల వివరాలు ఇలా

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకటి నుంచి మూడో తరగతి వరకూ గ్రామీణ ప్రాంతాల్లో రూ.6 వేలు, మండల కేంద్రాల్లో రూ.7,500, పట్టణాల్లో రూ.8,500గా నిర్ధారించారు. 4, 5 తరగతులకు గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.9 వేలు, పట్టణాల్లో రూ.10,500, జిల్లా కేంద్రంలో రూ.12 వేలు, ఆరో తరగతికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.9 వేలు, మండల కేంద్రాల్లో రూ.9,500, జిల్లా కేంద్రాల్లో రూ.11,100గా ఫీజు నిర్ధారించారు. అయితే ఇంతకు మించి యాజమాన్యాలు వివిధ పేర్లతో వసూలు చేస్తున్నాయి.

అదనపు భారం.. ★★★

నేరేడుబిల్లి దుర్గారావు, విద్యార్థి తండ్రి, జువ్వలపాలెం

గతేడాది మా అబ్బాయి ఆరో తరగతి ఫీజు రూ.12 వేలు కట్టాం. ఇప్పుడు ఏడో తరగతికి రూ.20 వేలు చెల్లించాలని యాజమాన్యం చెబుతోంది. ఒక్క ఏడాదికే రూ.ఎనిమిది వేల భారం పెంచింది. ఇది దారుణం. పిల్లల చదువులకు అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టాలి.

తట్టుకోలేకపోతున్నాం.. ★★★

కొల్లి శ్రీనివాస్, విద్యార్థి తండ్రి, దొడ్డనపూడి

పిల్లల చదువుల భారం ఆర్థికంగా చాలా ఇబ్బందిగా ఉంటోంది. ఏడాదికేడాది ఫీజులు పెంచేస్తున్నారు. కనీసం ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం విచారకరం. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

నిబంధనలు పాటించాలి.. ★★★

నారాయణ, డిఇఒ, పశ్చిమగోదావరి జిల్లా

విద్యాసంస్థలు నిబంధనలు పక్కాగా పాటించాలి. ఇప్పటికే అన్ని యాజమాన్యాల విద్యాసంస్థలకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ఎక్కడైనా ఫీజుల కోసం బలవంతం పెడితే ఫిర్యాదు చేయాలి. కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులనే వసూలు చేయాలి.

ఎన్‌టిఆర్ కీర్తి అజరామరం

నివాళులు అర్పించిన కలెక్టర్ వెట్రిసెల్వి



ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పించిన కలెక్టర్, జెసి

ప్రజాశక్తి - ఏలూరు

పురాణపాత్రల్లో నటించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన డాక్టర్ ఎన్‌టి.రామారావు కీర్తి అజరామరమని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి కొనియాడారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మాజీ సిఎం నందమూరి తారకరామారావు 102వ జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్‌టిఆర్ చిత్రపటానికి కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్.పెదబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మా తెలుగు తల్లికి మల్లెపూదండ ప్రార్థనా గీతంతో కార్యక్రమం ప్రారంభమవ్వగా ఎన్‌టిఆర్ జీవిత చరిత్రను ప్రదర్శించారు. గండికోట రాజేష్ శిష్యబృందం లవకుశ సినిమాలో శ్రీరామకళ్యాణం, పట్టాభిషేకం అంశాలపై ప్రదర్శించిన కూచిపూడి నృత్యప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులను ప్రత్యేకంగా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ తెలుగు సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పిన ఎన్‌టిఆర్ తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. భవిష్యత్ తరాలకు ఎన్‌టిఆర్ ఒక అద్భుతమైన నాయకుడన్నారు. రిటైర్డ్ రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమయపాలన, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరు ఎన్‌టిఆర్ అన్నారు. శ్రీశ్రీ విద్యాసంస్థల అధినేత ఎంబిఎస్.శర్మ మాట్లాడుతూ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లని తలచి సంక్షేమరాజ్యం సృష్టించి సమ సమాజ నిర్మాతగా లౌకికవాదిగా ఎన్‌టిఆర్ పేరొందారన్నారు. వై.ఆనందనాయుడు మాట్లాడుతూ తెలుగు వారికి, మన రాష్ట్రానికి ఎన్‌టిఆర్ ఒక గుర్తింపు తెచ్చారన్నారు.

ఎన్‌టిఆర్ చరిత్రపై ఫొటో ప్రదర్శన

ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను కలెక్టర్‌తోపాటు కార్యక్రమానికి వచ్చిన ప్రజలు, అధికారులు తిలకించారు. కార్యక్రమంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, నగరపాలక సంస్థ కోఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్.పెదబాబు, మాజీ కార్పొరేటర్ చోడే వెంకటరత్నం, సెట్‌వెల్ మేనేజర్ సత్యనారాయణ, పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ పట్టాభి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీల్లో వసతుల కల్పనకు కృషి

డిఆర్‌డిఎ పీడీ విజయరాజు

నిర్వాసితులతో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా పునరావాస గ్రామాల్లో నిర్వాసితులకు మౌలిక వసతుల కల్పనకు సంబంధించి పలు శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. సమావేశంలో పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ భూములు ఇచ్చారుగానీ ఆ భూముల్లో వ్యవసాయం చేయాలంటే పూర్వం వేసిన బోర్లే ఉంచారని, ఆ బోర్లు సరిగ్గా పని చేయక వ్యవసాయానికి నీటి కొరత ఏర్పడుతుందని వాపోయారు. ఇక్కడ నేలల్లో పొగాకు ఎక్కువ పండిస్తున్నారని, పొగాకు సాగుకు లైసెన్సులు ఇప్పించాలని కోరారు. డ్వాక్రా మహిళలకు రుణాలు, పంటల సాగుకు రుణాలు ఇప్పించాలని అధికారులను కోరారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ పునరావాస కాలనీల్లోని నిర్వాసితులకు అన్ని సదుపాయాలూ కల్పించడానికే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పలు రకాల పథకాలకు సంబంధించి ఐటిడిఎలో దరఖాస్తు పెట్టుకోవాలని సూచించారు. నిర్వాసితుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పీజీ బుజ్జిబాబు, జిల్లా లీడ్ బ్యాంక్ సహాయ మేనేజర్ చంద్రశేఖర్, డిఆర్‌డిఎ ఎపీడీ అనిత, డిపిఎం భూషణం, రాజబాబు, తహశీల్దార్లు శ్రీనురాజు, ఉదయ్‌భాస్కర్, ఎంపిడిఒ నిఖిల్ మధుశరణ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కూటమి కృషి

ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

సమావేశంలో ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. నిర్వాసితులను అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఎఎస్ఆర్ నగర్‌లో సదుపాయాలు కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - టి.నర్సాపురం

ఎస్ఆర్ నగర్‌వాసులకు విద్యుత్, తాగునీటి సౌకర్యాలతోపాటు మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన టి.నరసాపురంలో ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం సిపిఎం మండల కమిటీ సమావేశం బరగడ కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి రవి మాట్లాడుతూ మండలంలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, లింక్ రోడ్ల నిర్మాణం వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. 17 సంవత్సరాల క్రితం నిర్మించిన ఎఎస్ఆర్ నగర్‌లో ఇళ్లకు కరెంటు, నీటి సౌకర్యాలు లేక గిరిజన పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించాలని సాక్షాత్తు హైకోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస అవసరాలైన కరెంటు, నీటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి మడకం సుధారాణి, సభ్యులు గుడెల్లి వెంకట్రావు, మడకం కుమారి, మొండ్రు శిరీష, బరగడ కుమారి, అనుమోలు మురళీ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగాన్ని నిర్మూలించాలి: కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

యువత భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని జిల్లాలో పూర్తిగా తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో 'నాషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో నిర్వహించే కార్యక్రమాలపై ఏర్పాటైన జిల్లాస్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన స్థానిక కలెక్టరేట్లోని గౌతమి సమావేశపు హాలులో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు నేటి యువత బానిసలై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. జిల్లాలో యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉండేలా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం కారణంగా కలిగే దుష్ప్రభావాలపై అవగాహనా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ నివారణ దినోత్సవం సందర్భంగా జూన్ ఒకటో తేదీ నుండి 26వ తేదీ వరకూ మాదకద్రవ్యాల వినియోగం కారణంగా కలిగే దుష్ప్రభావాలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

మాదకద్రవ్యాల సరఫరా, వినియోగంపై ఫిర్యాదు చేయదల్చుకున్నవారు 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. 1972 టోల్‌ఫ్రీ నెంబర్‌ను జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, ప్రధాన సెంటర్లలో ప్రజలకు తెలిసేలా ప్రదర్శించాలన్నారు. జిల్లాలోని అన్ని మెడికల్ షాపుల్లోనూ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా నార్కోటిక్ మందుల అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు రవాణా చేసే వారికి కఠిన శిక్షలు పడేలా కేసులు నమోదు చేయాలని అన్నారు.

జిల్లాను మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రజలను ప్రధాన భాగస్వాములను చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం కారణంగా కలిగే దుష్ప్రభావాలు, 1972 టోల్ ఫ్రీ నెంబర్ తదితర ప్రచార స్టిక్కర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్‌కుమార్, డిఎంహెచ్ఒ డాక్టర్ మాలిని, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, డిఎస్‌డిఒ శ్రీనివాసరావు, పోలీస్, ఐసిడిఎస్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

అన్నాక్యాంటీన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

అన్నాక్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

అన్నా క్యాంటీన్లలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక నరసింహారావుపేటలో ఇండోర్ స్టేడియం వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ను బుధవారం రాత్రి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. రుచి, నాణ్యత గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పేదల ఆకలిని తీర్చేందుకు తక్కువ ధరకే నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను ఏర్పాటుచేసిందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అన్నా క్యాంటీన్ల ద్వారా రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఐదు రూపాయల ధర కన్నా ఎక్కువ వసూలు చేయవద్దని, ఉదయం మిగిలిన ఆహార పదార్థాలను సాయంత్రం సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పెట్టవద్దని, అన్నా క్యాంటీన్ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రజలు ఆహారం తిన్న తర్వాత ప్లేట్‌లను విమర్శలకు తావు లేకుండా పూర్తిగా శుభ్రం చేయాలన్నారు. కలెక్టర్‌తో పాటు ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, తదితరులు ఉన్నారు.

సర్టిఫికెట్ల ధ్రువీకరణలో సిబ్బంది

ఆర్‌జియుకెటి నూజివీడులో అడ్మిషన్లకు సర్టిఫికెట్ల ధ్రువీకరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో 2025-26 అడ్మిషన్లకు సంబంధించిన నాలుగు రోజుల సర్టిఫికేట్ ధ్రువీకరణ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక క్రీడలు, క్యాప్ కోటాలకు చెందిన అభ్యర్థుల ధ్రువీకరణ బుధవారం ప్రారంభమైంది. క్రీడల కోటాలో 320 మందికి 227 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అలాగే క్యాప్ కోటాలో 153 మందికి 119 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ప్రొఫెసర్ గోపాలరాజు పర్యవేక్షించారు. ఆయనతో పాటు అసిస్టెంట్ రిజిస్ట్రార్ అర్జునరావు, ముఖ్య పరిపాలన అధికారి డాక్టర్ బండి ప్రసాద్, ఇతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ధ్రువీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు విద్యాసంస్థ అన్ని ఏర్పాట్లు చేసింది. రానున్న మూడు రోజుల్లో ఇతర కేటగిరీలకు చెందిన అభ్యర్థుల ధ్రువీకరణ జరగనుంది.

పోలీస్ బాబాయ్..!

ట్రాఫిక్ క్లియర్ చేస్తూ సేవలందిస్తున్న వ్యక్తి

పోలీసు ఉద్యోగంపై అభిమానంతో 25 ఏళ్లుగా అదే పని

ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి - చింతలపూడి

అతను పోలీస్ కాదు.. కాని చింతలపూడి ప్రజలు అతన్ని పోలీస్ బాబాయ్ అని పిలుస్తారు. అతనికి పోలీసు ఉద్యోగం అంటే ఎనలేని అభిమానం. ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూనే ఉంటాడు. గత 25 ఏళ్లుగా తన ఉద్యోగం కాకపోయినా ట్రాఫిక్ క్లియర్ చేస్తూ చింతలపూడి ప్రజలకు సేవలందిస్తున్నారు. మండలంలోని ఊట సముద్రానికి చెందిన రాయల నాగేశ్వరరావు చిన్నప్పటి నుంచి పోలీసు ఉద్యోగంపై అభిమానంతో ప్రతిరోజూ తమ గ్రామం నుంచి చింతలపూడికి వచ్చి ట్రాఫిక్ పోలీస్ విధులు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, వాహనాలు రోడ్లపై నిలుపుదల చేయకుండా చూస్తున్నారు. వర్షం వచ్చినా, ఎండ అధికంగా ఉన్నా ప్రతిరోజూ చింతలపూడికి రావాల్సిందే. అలాంటి పోలీస్ బాబాయ్ పొట్ట కూటి కోసం ఇబ్బంది పడుతున్నాడు. కుటుంబ ఆధారం లేకపోవడం, గత 25 ఏళ్లుగా ఆయనకు సంపాదన, వసతి గృహం కూడా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఆయన చేసిన సేవలు గుర్తించి ఆయనకు మౌలిక సదుపాయాలు కల్పిస్తే బాగుంటుందని ప్రజల అభిప్రాయపడుతున్నారు.

మహిళలకు బాసటగా శక్తి యాప్

శక్తి టీమ్ ఇన్‌ఛార్జి సిఐ సుబ్బారావు

ఏలూరు స్పోర్ట్స్ : మహిళలకు ఎటువంటి ఆపద సమయంలోనైనా శక్తి యాప్ బాసటగా నిలబడుతుందని శక్తి టీమ్ ఇన్‌ఛార్జి సిఐ సుబ్బారావు అన్నారు. నగరంలోని ఆశ్రమంలో ఉన్న నర్సింగ్ కళాశాలలో మహిళలకు, విద్యార్థులకు శక్తి యాప్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. శక్తి టీమ్ ఇన్‌ఛార్జి సిఐ సుబ్బారావు విద్యార్థులకు అనేక విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర డిజిపి మహిళల భద్రత కోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. మహిళలు ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే 79934 85111 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని, వెంటనే పోలీసుల సహాయం అందుతుందని చెప్పారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక చట్టాలను అమలు చేయడంలో పోలీస్ శాఖ ముందడుగు వేసి మహిళల భద్రతే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. ఆపదలో ఉన్న మహిళలు, విద్యార్థినిలు పలు నెంబర్లకు ఫోన్ చేయడం ద్వారా అత్యవసర సేవలు అందుతాయన్నారు. 112 (అత్యవసర సేవలు), 1930 (సైబర్ మోసాల నివేదికల కోసం), 1098 (బాలల హెల్ప్‌లైన్), 181 (మహిళల హెల్ప్‌లైన్), 1073 (ట్రాఫిక్ సమాచారం కోసం), 101 (ఫైర్ ఎమర్జెన్సీ) వీటికి ఫోన్ చేస్తే అత్యవసర సహాయం అందుతుందని తెలిపారు.

పేరు గొప్ప.. ఊరు దిబ్బ..!

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్యం తీరు

పేరుకుపోతున్న చెత్త

విజృంభిస్తున్న దోమలు, పందుల స్వైరవిహారం

పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్యం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉంది. ఏలూరులోని పలు డివిజన్లలో పారిశుద్ధ్య పరిస్థితులు చాలా దారుణంగా మారాయి. మరీ ముఖ్యంగా ఏలూరులోని చైత్ర హాస్పిటల్ ఎదురుగా ఉన్న సందులో కొన్ని రోజుల నుంచి చెత్త పేరుకుపోయి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా అశోక్ నగర్‌లోని రాజీవ్‌గాంధీ పార్క్ వద్ద పరిస్థితి మరీ అధ్వానంగా తయారైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు చెత్తను ఇళ్ల వద్ద నుంచి సేకరించి డంపింగ్ యార్డుకు తీసుకెళ్లకుండా ఆ ప్రదేశంలో పడేస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. దోమలు పెరిగిపోయి, ఆ చెత్త వద్ద పందులు సైతం తిరుగుతున్నాయని, మురుగు వాసన వస్తుందని, వాటి వల్ల పలు వ్యాధులు సోకే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం అంటూ ప్రగల్భాలు పలకడమే గాని వాస్తవ పరిస్థితి మాత్రం దానికి భిన్నంగా ఉందని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అశోక్‌నగర్‌లో రాజీవ్ గాంధీ పార్క్ పక్కన ఉన్న చెత్త కుప్ప వద్ద పాములు సైతం తిరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శానిటేషన్ సిబ్బంది ఇటువంటి ప్రాంతాలను గుర్తించి చెత్తను తొలగించాలని, మళ్లీ ఆ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిఒ 23 ప్రకారం బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

కలెక్టర్‌ను కోరిన ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్

కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న ఎన్‌జిఒస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగులకు సంబంధించిన సాధారణ బదిలీల జిఒ 23ను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నేపథ్యంలో ఆ జిఒ ప్రకారం బదిలీలన్ని పారదర్శకంగా జరిపించి, ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్‌లో ఉన్న ఆఫీస్ బేరర్స్‌కు అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు, జిఒల ప్రకారం బదిలీ చేసేలా ప్రతి శాఖాధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ వారు కోరారు. ఈ మేరకు బుధవారం ఏలూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెట్రిసిల్విని కలిసి కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే జిల్లా రెవెన్యూ అధికారికి తగు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఇటీవల గ్రామ, వార్డు సచివాలయంలో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరిన ఎపి ఎన్‌జిఒ సంఘ విజ్ఞప్తి మేరకు సంబంధిత డిఎంహెచ్ఒకు ఆదేశాలు ఇచ్చి ఎఎన్ఎంల ఉద్యోగోన్నతుల ఫైల్‌ను ఆమోదించిన కలెక్టర్‌కు పూల మొక్కను ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, ఎన్‌జిఒస్ నాయకులు, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

పేదలకు ఉన్నత విద్య అందించడమే లక్ష్యం

శ్రీసిద్ధార్థ విద్యాసంస్థల ఛైర్మన్ మోహనరావు, డైరెక్టర్లు రవిబాబు, సాంబశివరావు, సత్యనారాయణ


మోహనరావు


రవిబాబు


సాంబశివరావు


సత్యనారాయణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని శ్రీ సిద్ధార్థ విద్యాసంస్థల ఛైర్మన్ మేడ మోహనరావు, డైరెక్టర్లు డాక్టర్ గొల్లపూడి రవిబాబు, తోటకూర సాంబశివరావు, మోరం పూడి సత్యనారాయణ తెలిపారు. ఇంతటి గొప్ప విద్యా సంస్థకు డైరెక్టర్లుగా ఎదిగే అవకాశం లభిస్తుందని ఎన్నడూ ఊహించలేదని వారు చెప్పారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. మధ్యతరగతి వ్యవసాయ కుటుంబాల్లో జన్మించిన తాము పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించడమే జీవిత లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా ముందడుగులు వేస్తున్నామని తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని మండల కేంద్రమైన విస్సన్నపేటలో 1989లో, నూజివీడు పట్టణంలో 2001లో స్కూల్, ఇంటర్, డిగ్రీ కళాశాలలను విద్యావేత్త మోహనరావు శ్రీ సిద్ధార్థ విద్యాసంస్థలను స్థాపించినట్లు తెలిపారు. 2004 నాటికి శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఇసి గ్రూపుల్లో 150 మంది విద్యార్థులు విద్యనభ్యసించేవారని చెప్పారు. నేడు ఇంటర్‌లో వెయ్యి మంది విద్యార్థులు చదువుతుండగా, 28 మంది ఫ్యాకల్టీ విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. 2001లో డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి కంప్యూటర్, ఎంపిసి, ఎంఎస్‌సిఎస్, సిబి జెడ్, బీకాం కోర్సులు కంప్యూటర్స్, జనరల్, బిఎ కోర్సుల్లో 650 మంది విద్యార్థులు చదవగా 20 మంది అధ్యాపకులు విద్యాబోధన అందించేవారన్నారు. ప్రస్తుతం ఇంజినీరింగ్ విద్య వైపు తల్లిదండ్రులు, విద్యార్థుల చూపు మరలడంతో డిగ్రీ కళాశాలలో 300 మంది విద్యార్థులు చదువుతుండగా 20 మంది ఫ్యాకల్టీ విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. 2006లో ఫార్మసీ కళాశాల ద్వారా ప్రతి ఏటా వంద మంది విద్యార్థులకు 25 మంది ఫ్యాకల్టీ సిబ్బంది విద్యను అందిస్తున్నారని తెలిపారు. ఇంటర్‌లో శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలకు నాలుగుసార్లు స్టేట్ ఫస్ట్ ర్యాంక్, ఎంసెట్, జెఇఇ, మెయిన్స్‌లో మంచి ర్యాంకులు సాధించి ప్రతిష్టాత్మక నిట్‌లలో సీట్లు, నీట్ పరీక్షలో మంచి ర్యాంకులు సాధించి డాక్టర్ సీట్లు సాధించారని చెప్పారు. డిగ్రీ కళాశాలలో నాలుగుసార్లు యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంకులను విద్యార్థులు సాధించారన్నారు. తమ కళాశాలలో చదివిన విద్యార్థులు డిఆర్‌డిఎలో శాస్త్రవేత్తలుగా, మల్టీనేషన్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, డాక్టర్లుగా, ఛార్టర్డ్ అకౌంటెంట్లుగా, ప్రభుత్వ రంగంలోని అనేక శాఖల్లో అధికారులుగా స్థిరపడినట్లు చెప్పారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో వందలాది సంఖ్యలో తమ విద్యార్థులు స్థిరపడి గొప్పగా జీవిస్తున్నట్లు తెలిపారు.

ఇంటర్నేషనల్ స్కూల్ పెద్దపెద్ద నగరాలకు మాత్రమే పరిమితం కావడం సరికాదని, చిన్న పట్టణాలకు, పల్లెలకు కూడా చేరువ చేయాలనే సత్సంకల్పంతో ఆరు ఎకరాల సువిశాల ప్రాంగణంలో అన్ని సౌకర్యాలతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభించినట్లు రవిబాబు చెప్పారు. ఎసి తరగతి గదులు, డిజిటల్ క్లాస్ రూమ్స్, విశాలమైన క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్, యాక్టివిటీ బేస్డ్ ఎడ్యుకేషన్ అందించడం తమ ప్రత్యేకత అని తెలిపారు. తరగతి గదికి 30 మంది విద్యార్థులు ఉంటారని చెప్పారు. ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి అనుభవం, నైపుణ్యత కలిగిన ఉపాధ్యాయులు తమ ఇంటర్నేషనల్ స్కూల్లో విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం బస్సు సౌకర్యం ఉందని, రానున్న రోజుల్లో హాస్టల్ సౌకర్యం కూడా కల్పిస్తామని తెలిపారు. ఈ ఏడాది తొమ్మిదో తరగతి వరకు హైస్కూల్‌ను ప్రారంభించామన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో పదో తరగతి కూడా ప్రారంభిస్తామని తెలిపారు. విజయవాడ, ఏలూరు వంటి నగరాలతో పోల్చితే సామాన్యులకు అందుబాటులో తమ ఇంటర్నేషనల్ స్కూల్ ఫీజులు ఉంటాయన్నారు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల్లోని చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించటమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. నేటికీ తాము ఎంతో మంది నిరుపేదలకు ఉచిత విద్య అందిస్తున్నట్లు తెలిపారు.

ఇంటర్నేషనల్ స్కూల్ భవనం

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని పులిరాముడుగూడెం పంచాయతీలో ఆయన బుధవారం పర్యటించారు. గ్రామస్తులతో ముచ్చటిస్తూ రోడ్లు, డ్రెయినేజీలు పరిశీలించారు. గ్రామానికి ఆనుకుని ఉన్న కొండవాగు ప్రవాహంతో గ్రామంలో రోడ్లు దెబ్బ తిని అధ్వానంగా మారుతున్నాయని పలువురు ఎంఎల్ఎకు వివరించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ వచ్చే వర్షాకాలంలో అలా జరగకుండా రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేపట్టేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. పులిరాముడుగూడెంలో ఉచిత మంచినీటి ప్లాంటును ఆయన ప్రారంభించారు. అనంతరం రవ్వవారిగూడెంలో రూ.32 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఇంజినీరింగ్ ఇఇ లలిత, ఎంపిడిఒ జ్యోతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మురళీకృష్ణ, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

డిఆర్‌డిఎ పీడీ విజయరాజు

ప్రజాశక్తి - దెందులూరు

ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఒత్తిడి దూరమై మానసికోల్లాసం కలుగుతుందని డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక వట్లూరు టిటిడిసిలో డిఆర్‌డిఎ ఉద్యోగులకు యోగాభ్యాసన నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవనానికి ప్రతిఒక్కరూ ప్రతిరోజు యోగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎలో పలు విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలవరం : యోగా చేయడం వల్ల మానసిక, శారీరక దృఢత్వం కలుగుతుందని పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణ తరగతులు ఎంపిడిఒ చెరుకూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. మాస్టర్ ట్రైనర్ డాక్టర్ బిరా విజయ్‌బాబు యోగా శిక్షణను ఇచ్చారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 14 మంది తలసేమియా చిన్నారులకు రక్త మార్పిడి చికిత్స నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ రక్త పరీక్షలు తలసేమియా సెంటర్‌లోనే చేసే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తలసేమియా చిన్నారులను పరామర్శించి వారికి పండ్లను, ప్రోటీన్ పౌడర్ డబ్బాలను పంపిణీ చేశారు. అనంతరం తలసేమియా చిన్నారులకు వారి సహాయకులకు 30 మందికి భోజనాన్ని ఏర్పాటు చేసిన వేగుంట స్వామికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ జె.సత్యనారాయణరాజు, కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, ఎం.చంద్రశేఖర్, మేతర అజయ్‌బాబు, కొత్త గుండు శ్రీనివాస్, పెన్మత్స శ్రీరామరాజు, మునగాల మురళీకృష్ణ, బొల్లా లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబసభ్యుల, గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి - చాట్రాయి

విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని పోలవరం గ్రామంలో కోనేరు రంగారావు కాలనీలో చోటు చేసుకుంది. యువకుని మృతికి విద్యుత్ శాకాధికారుల నిర్లక్ష్యమే కారణమని మృతుని తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాట్రాయి ఎస్ఐ డి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... 11 కెవి విద్యుత్ లైను కోనేరు రంగారావు కాలనీలోని పరసా ఈశ్వరరావు ఇంటి పక్కన ఉన్న బజారు నుంచి వేశారు. గృహాలకు విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ లైను కూడా పక్కనే ఉంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఈశ్వరరావు కుమారుడు ప్రభుకిరణ్ (17) తమ ఇంట్లో లైట్లు ఆపుతుండగా ఒక్కసారిగా స్విచ్‌బోర్డు మంటలు వచ్చి విద్యుదాఘాతానికి గురైన ప్రభుకిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుని మృతితో తల్లిదండ్రులు రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. మృతుడు ప్రభుకిరణ్ ఇంటర్ ఉత్తీర్ణత సాధించి ఎంసెట్ ప్రవేశ పరీక్ష రాశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

11 కెవి విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, సరిచేయాలని పలు విద్యుత్ శాఖాధికారులకు పలుమార్లు విన్నవించినా వారు పట్టించుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. 11 కెవి తీగలను సరిచేస్తే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీనియర్ ఉపాధి మేట్లకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం

టి.నర్సాపురం : ఉపాధి హామీ పనుల్లో కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ ఉపాధి మేట్లకు కనీస వేతనం రూ.పది వేలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గూడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. మండలంలోని చాకలి చెరువులో ఉపాధి పని ప్రదేశంలో పర్యటించిన వ్యవసాయ కార్మిక సంఘం బృందం కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కూలీలు తమ సమస్యలు బృందానికి చెప్పుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ప్రతిమేటుకు ఉపాధి కూలికి మనిషికి రూ.ఐదు చొప్పున ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు. గత నాలుగు వారాలుగా ఉపాధి పని డబ్బులు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించి కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మడకం కుమారి, సుధారాణి పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌టి.రామారావు జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తెలుగువారి ఖ్యాతిని ప్రపంచం నలుదిశలా చాటిన మహోన్నత వ్యక్తి, టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు నందమూరి తారక రామారావు అని పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కొనియాడారు. ఎన్‌టిఆర్ 102వ జయంతి వేడుకలను బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు జై ఎన్‌టిఆర్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బాణసంచా కాల్చి ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్ కర్రి శ్రీనివాస్, టిడిపి నగర కార్యదర్శి రెడ్డి నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : బయ్యన్నగూడెంలో టిడిపి మండలాధ్యక్షులు పారేపల్లి నరేష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పారేపల్లి శ్రీనివాస్, వేమ సత్తిబాబు, పారేపల్లి బుజ్జిబాబు, ఆనం సాయి, పారేపల్లి పవన్, మద్దిపాడు గంగాధర్, మార్గాని సూర్యనారాయణ, ప్రభుత్వాసుపత్రి డాక్టర్ గీతారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలోని ప్రగడవరంలో గ్రామ నాయకులు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. చింతలపూడి నగర పంచాయతీలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని 16 గ్రామాల్లో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, పట్టణంలో, పలు సెంటర్లలో, ఎంప్లాయీస్ కాలనీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ పి.సత్యనారాయణ, ఎం.జగదీష్, వై.కిషోర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని ఏలూరు రోడ్డులో ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ జెండా ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు పరిమి సత్యనారాయణ భారీ మోటర్ సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీగా వెళ్లి కాకర్ల కాంప్లెక్స్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పట్టణ మాజీ అధ్యక్షులు రావూరి కృష్ణతో కలిసి నూతన అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ అందించారు. వేగవరం, లక్కవరం గ్రామాల్లో జయంతి వేడుకలు నిర్వహించారు.

పోలవరం : మండలంలోని పోలవరం, కొత్తపట్టిసీమ, గూటాల, ప్రగడపల్లి గ్రామాల్లో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రగడపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచి కలుం బాపిరాజు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొత్త పట్టిసీమ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచి మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో, పోలవరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో టిడిపి మండలాధ్యక్షులు బొడ్డు కృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి, పులిహోర, స్వీట్లు, మిక్చరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు కుంచె దొరబాబు మాట్లాడారు.

కుక్కునూరు : మండలంలోని టిడిపి కార్యకర్తలందరూ రామాలయం సెంటర్ నుంచి ప్రధాన రహదారి వరకు ర్యాలీ నిర్వహించి ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు మొలిశెట్టి నాగేశ్వరరావు, రాము, పిచ్చుక రాజు రమణ రాజు, జెట్టి సూర్యం, తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి : చాట్రాయి, చనుబండ, సూరంపాలెం గ్రామాల్లో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు మాట్లాడారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

జీలుగుమిల్లి : ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను మండల వ్యాప్తంగా కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. బర్రింకలపాడు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. దర్భగూడెంలో తెలుగు యువత అధ్యక్షులు తమ్మన సాంబ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పి.అంకంపాలెంలో ఎంపిటిసి నాలి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు. జీలుగుమిల్లిలో టిడిపి మండలాధ్యక్షులు సుంకవల్లి సాయి ఆధ్వర్యంలో పిహెచ్‌సిలో రోగులకు రొట్టె, పండ్లు పంపిణీ చేశారు.

మండవల్లి : భైరవపట్నంలోని శృతివనంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎన్‌టిఆర్ చిత్రపటానికి ఎంపిడిఒ బి.ఆనంద్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు, పశువైద్యాధికారి హనుమంతరావు, మండల పరిషత్ ఎఒ అబ్దుల్ సలాం, ఉపాధి హామీ సిబ్బంది, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఆగిరిపల్లి మెయిన్ సెంటర్‌లో తెలుగుదేశం స్తూపం వద్ద తెలుగుదేశం టౌన్ పార్టీ అధ్యక్షులు పామర్తి నరసింహారావు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్.విక్టర్‌బాబు, సీతయ్య, బి.శ్రీను, బాబూరావు, రంగారావు పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : తెడ్లం గ్రామంలో టిడిపి నాయకులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ముప్పన స్రవంతి రమేష్‌రెడ్డి, కేతిరెడ్డి వీరారెడ్డి, బండి శ్రీనివాసరావు, యలమర్తి భానుప్రసాద్, నాగదేశీ శౌరి, కూటమి నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలతో రోగాలు దూరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తల్లిదండ్రులు బిడ్డలకు నిర్ణీత సమయంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని, అప్పుడే పది రకాల ప్రాణాంతక వ్యాధులను అరికట్టగలమని, రోగాల బారిన పడకుండా బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక జ్వాలా పరమేశ్వర స్వామి పట్టణ ఆరోగ్య కేంద్రం, జెపి కాలనీ సచివాలయంలో బుధవారం జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కేంద్రాన్ని ఆయన సందర్శించి తల్లులతో మాట్లాడారు. బిడ్డలకు నిర్ణయించిన సరైన సమయంలో టీకాలు వేయాలని సూచించారు.

పెన్షన్ ఇప్పించండి సారూ..!

మహిళ వేడుకోలు

ప్రజాశక్తి - చింతలపూడి

గతేడాది నుంచి పెన్షన్ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పెన్షన్ ఇవ్వడం లేదని మారుమూడి మార్థమ్మ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల వద్దకు వెళ్తే పెన్షన్ వస్తుందని చెబుతున్నారే తప్ప రావడంలేదన్నారు. తాను ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని వాపోతుంది. పెన్షన్ వస్తే మందులకు, హాస్పటల్ ఖర్చులకు ఉపయోగపడుతుందని, ఉన్నతాధికారులు దృష్టి సారించి పెన్షన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతుంది.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - దెందులూరు

పెదపాడు శాఖా గ్రంథాలయంలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులతో కలిసి ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్‌బాబు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం వల్లూరు శివప్రసాద్ రచించిన ఏకాగ్రత అనే పుస్తకం నుంచి "పని దొంగ" అనే కథను విద్యార్థులచే చదివించడం, కథలు చెప్పించడం, పుస్తక సమీక్ష చేయించడం వంటివి చేశారు. రిసోర్స్ పర్సన్ యోగా ట్రైనర్ డి.రేణుక ఎల్లమ్మ విద్యార్థులకు యోగా చేయటం వల్ల ఉపయోగాల గురించి వివరించారు. విద్యార్థులకు స్నాక్స్ పంపిణీచేశారు.

30న సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు లావేటి కృష్ణారావు, అంగులూరి జాన్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిఐటియు 1970లో మే నెల 30న కలకత్తాలో ఏర్పడి 55 ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 30వ తేదీన సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 30వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక నగరపాలక సంస్థ వద్ద ఉన్న సిఐటియు స్తూపం వద్ద జెండాను ఆవిష్కరిస్తామని, అనంతరం సభా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

రోడ్డు నాణ్యతకు చర్యలు తీసుకుంటాం

ఆర్అండ్‌బి డిఇ హరికృష్ణ

ప్రజాశక్తి - కుక్కునూరు

రోడ్డు నాణ్యతకు చర్యలు తీసుకుంటామని, రోడ్డు సైడ్ సెకండ్ లేయర్ త్వరలో పోస్తామని ఆర్అండ్‌బి డిఇ హరికృష్ణ చెప్పారు. కుక్కునూరు రోడ్డు నాణ్యత పనులను ఆయన క్వాలిటీ కంట్రోల్ బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి మండలాధ్యక్షులు యుగంధర్ సూచన మేరకు మండల ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ డిఇని కలిసి రోడ్డు అప్రోచ్ సైడ్ మట్టి పోయకపోవడంతో ఎదురుగా వాహనాలు వస్తే తప్పుకోవడం కుదరక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. కచ్చితంగా సైడ్ మట్టి పోయాలని కోరారు. రావిగొమ్మ వద్ద నాణ్యత లోపించి గోతులు దర్శనమిస్తున్నాయన్నారు. సెకండ్ లేయర్ పనులు త్వరగా చేపట్టాలని కోరారు. దీనిపై డిఇ స్పందిస్తూ రోడ్డు నాణ్యతకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

టి.నరసాపురం ఎంపిడిఒగా నగరాజకుమారి

ప్రజాశక్తి - టి.నరసాపురం


ఎంపిడిఒకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

టి.నరసాపురం ఎంపిడిఒగా గారపాటి నగరాజకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. భీమడోలు మండల ప్రజా పరిషత్ పరిపాలనాధికారిణిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై టి.నరసాపురం వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ అదనపు బాధ్యతలతో పరిపాలనాధికారిణి జి.మణికుమారి ఎంపిడిఒగా పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన నగరాజకుమారికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

మహానాడుకు తరలిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మహానాడుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు

కడపలో జరుగుతున్న టిడిపి మహానాడుకు ముదినేపల్లి మండలం నుంచి భారీగా కార్యకర్తలు, నాయకులు మంగళవారం రాత్రి తరలి వెళ్లారు. మండలంలోని వణుదుర్రు గ్రామ టిడిపి అధ్యక్షులు వీరమల్లు రాము, బూత్ కన్వీనర్ కట్టా బాలమురళి ఆధ్వర్యంలో ఒక గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ వాహనాల్లో మహానాడుకు పాల్గొనేందుకు కడప బయలుదేరి వెళ్లారు.

నేరాలు - ఘోరాలు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న వ్యాన్ : క్లీనర్ మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో క్లీనర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని లక్ష్మీపురం గ్రామ శివారు జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోళ్ల ఫారం వ్యాన్ జంగారెడ్డిగూడెం వైపు నుంచి సూర్యాపేటకు వెళ్తూ మార్గమధ్యలో లక్ష్మీపురం సమీపంలో రహదారి పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న క్లీనర్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపారు.

800 కేజీల కోకో గింజలు చోరీ

జంగారెడ్డిగూడెం : మండలంలోని గుర్వాయిగూడెం రైతు అట్లూరి శ్రీనివాసరావుకు చెందిన 800 కేజీల కోకో గింజలను గుర్తు తెలిని వ్యక్తులు అపహరించుకుపోయారు. వాటి విలువ సుమారు రూ.నాలుగు లక్షలు ఉంటుందని రైతు వాపోతున్నాడు. సోమవారం రాత్రి సమయంలో బయట ఉన్న 15 కోకో గింజల బస్తాలను గుర్తు తెలని వ్యక్తులు దొంగిలించుకుపోయారని రైతు ఆవేదన చెందుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశానని, చోరులను పట్టుకుని తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు.

ముగ్గురు చోరులు అరెస్టు

జంగారెడ్డిగూడెం : మహిళ కళ్లల్లో కారం కొట్టి ఆమె మెడలో మంగళసూత్రాన్ని అపహరించిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డిఎస్‌పి రవిచంద్ర ఆయన కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి వెల్లడించారు. పట్టణంలో ఈ నెల 27వ తేదీన మహిళ కళ్లల్లో ముగ్గురు వ్యక్తులు కారం చల్లి ఆమె మెడలో నాలుగు కాసుల మంగళ సూత్రాన్ని అపహరించుకుపోయారు. ఆ ముగ్గురిని పోలీసులు జంగారెడ్డిగూడెంలో బుధవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.రెండు లక్షల విలువైన నాలుగు కాసుల మంగళసూత్రం స్వాధీనం చేసుకున్నారు.

ప్రశ్నించినందుకు దాడి చేశారని వ్యక్తి ఫిర్యాదు

ముదినేపల్లి : వైఎస్ఆర్ కాలనీలో డ్రెయినేజీ పనుల విషయమై ప్రశ్నించినందుకు తనపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారంటూ బుధవారం ఒక వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని పెద్దపాలెం వైఎస్ఆర్ కాలనీలో డ్రెయినేజీ పనులు జరుగుతున్నాయి. కాలనీకి చెందిన వ్యక్తి మేడువ ఫణీంద్ర డ్రెయినేజీ పనుల విషయమై అక్కడ పనులు చేయిస్తున్న సర్పంచి తమ్ముడు గండి రామారావును ప్రశ్నించాడు. దీంతో సర్పంచి బంధువులు గండి రామారావు, గండి అప్పారావు, గండి సరోజిని తనను తన తల్లిని బహిరంగంగా దుర్భాషలాడి తనపై దాడి చేసినట్లు ఫణీంద్ర పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనపై అకారణంగా దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫణీంద్ర పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మానవత్వం చాటిన సిఐ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ సిఐ మానవత్వం చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైనవారిని గమనించిన అటుగా వెళు తున్న సిఐ పి.సత్యశ్రీనివాస్ ఆగి వారిని ఆటోలో ఎక్కించి ఆసుపత్రికి తరలించేందుకు సహకరించారు. లింగపాలెం మండలం తోచిలక గ్రామానికి చెందిన పోలిబోయిన నాగేశ్వరరావు అతని భార్య ద్విచక్రవాహనంపై హనుమంతులగూడెం గ్రామంలో తమ బంధువుల ఇంటికి ఫంక్షన్‌కు బుధవారం బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో ఎదురుగా ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటోను బైక్ ఢీకొని భార్యాభర్తలిద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. అదే సమయానికి అటుగా వెళ్తున్న నూజివీడు పట్టణ సిఐ పి.సత్యశ్రీనివాస్ ఘటన వారిని గమనించి ఆగి క్షతగాత్రులను స్థానికుల సాయంతో ఆటోలో ఎక్కించి ఆసుపత్రికి తరలించేలా చేశారు. దీంతో మానవత్వం చాటిన పట్టణ సిఐకు గ్రామస్తులు, పలువురు సామాజికవేత్తలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. గాయాలపాలైన పోలిబోయిన నాగేశ్వరరావు, అతని భార్య ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు.

కంటి తుడుపు చర్యగా ధాన్యం మద్దతు ధర పెంపు

ప్రజాశక్తి - పెదపాడు (వట్లూరు)

2025-26 సంవత్సరానికి ఖరీఫ్, రబీ పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధర రైతుకు ఏమాత్రం సరిపోదని, క్వింటాల్‌కు రూ.69 పెంపు కంటి తుడుపు చర్య మాత్రమేనని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. పెదపాడు మండలం వట్లూరులోని గ్రంథాలయం ఆవరణలో రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలపై బుధవారం రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం వాస్తవ రైతుల ఖర్చులు లెక్కబెట్టి ఉత్పత్తి ఖర్చు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ధాన్యం క్వింటాల్‌కు రూ.మూడు వేలు కనీస మద్దతు ధర ప్రకటించి అమలు చేయాలని కోరారు. మిగిలిన అన్ని పంటలకు కూడా మద్దతు ధరలు పెంచాలని కోరారు.

స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యం

మండవల్లి సర్పంచి ఝాన్సీ

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో పంచాయతీ పని చేస్తుందని మండవల్లి సర్పంచి మెండ ఝాన్సీ అన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల ఆదేశాలతో కొండరాయిచెరువులో స్పటిక కట్టడంతో పాటు బ్లీచింగ్ చల్లిస్తున్న విధానాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండరాచెరువులోని నీరు పసరులుగా మారాయని గ్రామస్తులు పంచాయతీ దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో సమస్యలను ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అధికారుల ఆదేశాలతో వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించే విధంగా చెరువులో బ్లీచింగ్ చల్లించి సంచులను ఏర్పాటు చేసి స్పటికను ఫిల్టర్ బెడ్లు కుండీల్లో కట్టించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ గిరిజాకుమారి సురేష్ బాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి టి.నరసాపురం గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

టి.నరసాపురంలోని టిడిపి అధికార ప్రతినిధి కొల్లి మురళీ నివాసం వద్ద ఆ పార్టీ గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొల్లి రమేష్, ఉపాధ్యక్షులుగా సందేపూడి సాయి, కార్యదర్శిగా జోనుబోయిన శేషారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు కొల్లి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టి.నరసాపురం జలవనరుల సంఘ అధ్యక్షులు కొనకళ్ల మోహన్‌కుమార్, మాజీ సర్పంచి జోనుబోయిన సోంబాబు, అద్దంకి జగ్గారావు, గంధం సీతయ్య, రాచబంటు వేములయ్య, కిలారు సాంబశివరావు, కాకాని గంగరాజు, కొక్కొండ ఈశ్వరాచారి పాల్గొన్నారు.

NAME CHANGE
I, PARUVU SUREKHA W/o Paruvu Hari Babu (late), Resident of D.No.9-1-44, Churchpeta, Narasapuram-534275, W.G.Dt. A.P. I have been changed my Minor Son's name from PARUVU SAJEEV (Old name) to PARUVU SAJEEV AARON (New name). Hence after all my minor son's Documents and correspondence will be continue with his new name PARUVU SAJEEV AARON

దస్తావేజులు పోయినవి
పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఏలూరు జిల్లా, ఏలూరు నగరం, రామకృష్ణాపురం ఓవర్ బ్రిడ్జి దగ్గర, డోర్‌నెం.22డి-8-15రు కాపురస్తులు మాగంటి రాజశేఖర్, మాగంటి వీరాస్వామి అను నాయొక్క ఒరిజినల్ లింక్ దస్తావేజులు పడిపోయినవి. ఏలూరు ఆర్.సిలో 1వ పుస్తకం దస్తావేజు నెం.954/2023 రిజిస్టరు చేయించుకొనియున్నాను. సదరు దస్తావేజునెం. 954/2023 రునకు లింకు దస్తావేజులు 332/1995 మరియు 333/1995 గల ఒరిజినల్స్‌ను నాకు ఇచ్చియున్నారు. అయితే నేను ప్రయాణంలో ఉండగా సదరు లింకు దస్తావేజు ఏలూరు, కొత్త బస్టాండ్ పరిధిలో పడిపోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైన దొరికినచో ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరని కోరుచున్నాను.
మాగంటి రాజశేఖర్, S/o.వీరాస్వామి, డోర్‌నెం.22డి-8-15, రామకృష్ణాపురం, ఏలూరు, ఏలూరు జిల్లా. సెల్: 7989182322